**Andhra Jyothi**

# టీచర్ల బోధన సామర్థ్య పరీక్ష వాయిదా: మంత్రి గంటా

హైదరాబాద్/విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): టీచర్లకు నిర్వహించ తలపెట్టిన బోధన సామర్థ్య పరీక్షను ప్రభుత్వం వాయిదా వేసింది. ఉపాధ్యాయ సంఘాల్లో ఈ పరీక్ష నిర్వహణపై వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. త్వరలో అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు బోధన సామర్థ్య పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. షెడ్యూలు ప్రకారం ఈ పరీక్షలు ఈ నెల 20, 21 తేదీల్లో, సెప్టెంబరు 10, 11 తేదీల్లో జరగాల్సి ఉంది. అయితే దీనిని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇందులో భాగంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, టీఎన్‌యూఎస్ కన్వీనర్లు కొనకళ్ల రెడ్డమ్మ, హైమారావు, తదితరులు మంత్రి గంటాను కలిసి ఈ అంశాన్ని ప్రస్తావించి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రస్తుతానికి పరీక్షను వాయిదా వేస్తున్నామన్నారు. ఈ పరీక్షల వల్ల ఉపాధ్యాయులకు ఏ ఇబ్బంది ఉండబోదని వారికి వివరించి అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి గంటా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు.